కబ్జా కోరల్లో లింక్ రోడ్డు

- కాలినడకన కూడా వెళ్లలేని దుస్థితి
- పంట తరలింపునకు ప్రతికూలం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురం నుంచి సంకాపురం వరకు ఉన్న 10 కి.మీ. పంచాయతీ లింక్ రోడ్డు ఒకప్పుడు రైతుల పంట పొలాలకు రహదారిలా, రెండు గ్రామాల అవసరాలకు జీవనాడిగా ఉండేది. కానీ ఇప్పుడు చెత్త డంప్‌గా మారింది. గ్రామంలోని డ్రెయినేజీ నీళ్ల రోడ్డుపైనే నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. కబ్జా కోరల్లో చిక్కుకొని పంట తరలింపు, అవసరాలకు, గ్రామస్తుల ప్రయాణానికి ప్రతికూలంగా మారింది.

కబ్జా కోరల్లో

రోడ్డును కొందరు కబ్జా చేయడంతో 33 అడుగులు వెడల్పు ఉండాల్సి ఉండగా 10 అడుగుల వెడల్పుకు కుంచించుకు పోయింది. కొన్ని చోట్ల కాలినడకన కూడా వెళ్లలేని దుస్థితికి చేరింది. బి.తిమ్మాపూర్, ఎక్లాస్‌పురంలోని పలువురు గ్రామస్తులు, రోడ్డుకు ఇరువైపులా పొలాలు ఉన్న రైతులు ఆక్రమణకు గురైనట్లు పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపుల వందల ఎకరాల పచ్చని పంట భూములు ఉన్నాయి. కానీ రైతులు తమ పొలాలకు చేరలేక, పండించిన పంటలను మార్కెట్‌కు తరలించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. గతంలో తహసీల్దార్, పంచాయతీరాజ్ డీఈకి ఫిర్యాదు చేసిన చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

25 ఏళ్ల క్రితం రోడ్డు ఏర్పాటు

పంచాయతీరాజ్ శాఖ 2000 సంవత్సరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా (ప్రస్తుతం జోగుళాంబ గద్వాల జిల్లా)లోని అయిజ మండలం ఎక్లాస్‌పురం నుంచి సంకాపురం గ్రామం వరకు గ్రామీణ మౌలిక సదుపాయాల కింద రోడ్డు ఏర్పాటు చేశారు. ప్రధానంగా రైతుల పంటల రవాణా, గ్రామాల మధ్య కనెక్టివిటీ కోసం రూపొందించారు.ఈ రోడ్డు మధ్యలో రాయచూర్- కర్నూలు అంతర్రాష్ట్ర రహదారి ఉంది. రోడ్డు ఏర్పాటు అనంతరం నిర్వహణ లోపం వలన ప్రజలకు సమస్యలు ఎక్కువయ్యాయి.

ప్రయాణానికి ప్రతికూలం

జిల్లా ఏర్పడిన అనంతరం రోడ్డు నిర్వహణ చేపట్టక పోవడంతో మోకాలి లోతు గుంతలతో అస్తవ్యస్తంగా మారింది. మరమ్మతుకు నిధులు కేటాయించక పోవడంతో ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. ఎక్లాస్‌పురం సమీపంలో రోడ్డు చెత్తా చెదారంతో డంపింగ్ యార్డుగా ఏర్పడగా, డ్రెయినేజీ నీరు నిల్వ ఉండి దుర్వాసనతో నానా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.


బి.తిమ్మాపూర్ శివారులో మురికి కూపంగా రోడ్డు


ఎక్లాస్‌పురం సమీపంలో డంపింగ్‌గా మారిన రోడ్డు

సమస్య పరిష్కరిస్తాం

రోడ్డు ప్రయాణానికి ప్రతికూలగా మారిందని ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే రోడ్డుకు మరమ్మతు చేయిస్తాం. రోడ్డు కబ్జాకు గురైందని రైతులు వాపోతున్నారు. కబ్జాకు గురైన రోడ్డును తిరిగి స్వాధీనం చేసుకుంటాం.

– రెడెప్ప, పంచాయతీరాజ్ డీఈఈ

దుర్వాసనతో అవస్థలు



రోడ్డుపై చెత్తా చెదారం డంప్ చేయడంతో దుర్వాసనతో అవస్థలు పడుతున్నాం. దోమలు ఉధృతి చెంది రోగాల బారిన పడుతున్నాం. రోడ్డు ఆక్రమణ వలన కుంచించుకు పోయింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్వర్ రెడ్డి, ఎక్లాస్‌పురం

రోడ్డును ఆక్రమించారు.



పలువురు రైతులు, గ్రామస్తులు రోడ్డును ఆక్రమించుకున్నారు. వర్షాకాలం రోడ్డుపై వెళ్లలేని దుస్థితి ఏర్పడుతుంది. దాదాపు 20 అడుగుల వెడల్పు మేర రోడ్డు ఆక్రమణకు గురైంది. దీంతో పంట తరలింపు, కూలీల తరలింపునకు ఇబ్బందిగా మారింది.

– తిమ్మప్ప, రైతు, అయిజ

క్లుప్తంగా

కొనసాగుతున్న భాగవత సప్తాహం



ఇటిక్యాల: మండల పరిధిలోని కొత్తదేవరపల్లి గ్రామంలో గ్రామ కమిటీ సభ్యుల సహకారంతో విశ్వహిందూ పరిషత్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో శ్రీ పాండురంగస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన భాగవత సప్తాహ మహోత్సవం మంగళవారం రెండో రోజు వైభవంగా సాగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి మనిషికి అసలైన ఆనందం భాగవత పఠనంతోనే లభిస్తుందన్నారు. భక్తులు శ్రీకృష్ణుడు చూపిన మార్గంలో జీవించాలని సూచించారు.కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

21 నుంచి కమ్మిడిస్వామి జాతర

కేటీదొడ్డి: దీపావళి జాతర సందర్భంగా మండలంలోని నందిన్నె గ్రామంలో ఈ నెల 21 నుంచి 23 వరకు కమ్మిడిస్వామి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 21న మైలార్లింగేశ్వర గుర్రం ఊరేగింపు, 22న శ్రీస్వామివారి ఉచ్చాయి మహోత్సవం, రథోత్సవం, 23న పల్లకీసేవా, సందెరాళ్ల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



అయిజ: అంగన్‌వాడీ టీచర్లు నిబంధనల మేరకు నడుచుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించినవారిపై చర్యలు తప్పవని డీబ్ల్యూఓ సునంద అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో సీడీపీఓ హేమలత పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. డీడబ్ల్యూఓ సునంద, తహసీల్దార్ జ్యోతి ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. పౌష్టికాహారంపై బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీవైఎస్ఓ



గద్వాల: నూతనంగా నియమితులైన జిల్లా క్రీడాధికారి(డీవైఎస్ఓ) కృష్ణయ్య మంగళవారం కలెక్టర్ బీఎం.సంతోష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

మానవపాడు:మండలంలోని కలుకుంట్ల ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంపీడీఓ రాఘవ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మేరీ, బేడిదపాడు కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

మానవపాడు: ఆటో డ్రైవర్ల యూనియన్ మహా సభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17న అలంపూర్ చౌరస్తాలో జరిగే మహాసభలకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మాలిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెట్ల తొలగింపు

ఇటిక్యాల: జాతీయ రహదారి నుంచి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా గుబురుగా పెరిగిన చెట్లు, ముళ్ల కంపలను ఎస్ఐ రవినాయక్ జేసీబీతో తొలగించారు. రోడ్డుకు అడ్డుగా చెట్లకొమ్మలు పెరగడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో చెట్లకొమ్మలు తొలగించినట్లు పేర్కొన్నారు.



అచేతనులకు చైతన్యదీప్తి మద్దిలేటి

గద్వాలటౌన్: అచేతనులకు చైతన్యదీప్తిగా పులిమామిడి మద్దిలేటి చేసిన ప్రజా ఉద్యమాలు చిరస్థాయిగా గుర్తుండి పోతాయని వివిధ ప్రజా సంఘాల నాయకులు అన్నారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు పులిమామిడి మద్దిలేటి వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక మద్దిలేటి స్థూపం వద్ద సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సమాజం కోసం, నమ్మిన సిద్ధాంతాల కోసం మద్దిలేటి పోరాడారన్నారు. మద్దిలేటి ఆశయ సాధన పోరుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రంలో అనేక ప్రజా ఉద్యమాలు చేపట్టారని, పేద ప్రజల కోసం నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ శంకర ప్రభాకర్, పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుభాన్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, ఇక్బాల్ పాష, మద్దిలేటి సతీమణి దానమ్మ, కూతురు బెల్లి లలిత, మన్యం కొండ, జయమ్మ, సునీత పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

అయిజ: యోగాతో మనసుకు ప్రశాంతత లభిస్తుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని అంబా భవానీ ఆలయ ఆవరణలోని కమిటీ హాల్లో మంగళవారం ఉచిత 'ధ్యాన–విజ్ఞాన యోగ' శిక్షణ తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శివానంద గురూజీ యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. యోగాతో రక్త ప్రసరణ మెరుగవుతుందని, గుండె పనితీరు బాగ ఉంటుందన్నారు. నిద్రలేమి, బరువు నియంత్రణ, జ్ఞాపకశక్తికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతిరోజు యోగా చేసి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భగత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.


యోగా చేస్తున్న ప్రజలు

స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలి

ధరూరు: బాలలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని జిల్లా బాలల సంరక్షణ కౌన్సిలర్ నర్సింహులు అన్నారు. బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని రేవులపల్లి గ్రామంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, వేధింపులపై 1098కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి సురేష్, పంచాయతీ కార్యదర్శి సురేష్, హెచ్‌ఎం మల్లప్ప, వీఓఏ ఆంజనేయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ కౌన్సిలర్ నర్సింహులు

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

ఎర్రవల్లి: ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఇటిక్యాల ఎస్ఐ రవినాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉదండాపురం గ్రామంలో సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం సభ్యులు డయల్–100, రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, సీసీ కెమెరాల ఉపయోగం వంటి అంశాలపై పాటలు, మాటల రూపంలో అవగాహన కల్పించారు. ఎస్ఐ రవినాయక్ మాట్లాడుతూ.. యువత బెట్టింగ్‌లు, చెడు వ్యసనాల బారిన పడి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దన్నారు. చిన్నారులు చెడు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు ఎస్ఐ కేశవరావు, రాధమ్మ, రామాంజనేయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవినాయక్

గుంతల రోడ్డుకు మరమ్మతు

ఉండవెల్లి: మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే బీటీరోడ్డు రెండేళ్లుగా గుంతలమయమై అధ్వాన స్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఎస్ఐ శేఖర్ రెండు టిప్పర్ల ఎర్రమట్టి తోలించి రోడ్డుకు మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, ప్రజలు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.


మరమ్మతు చేయిస్తున్న పోలీసులు

జిల్లాస్థాయి క్రీడలకు ఏర్పాట్లు పూర్తి

ధరూరు: స్థానిక ఉన్నత పాఠశాలలో ఈ నెల 15న నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ 69వ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈఓ రవీంద్రబాబు, డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలను కబడ్డీ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్–14 విభాగంలో పాల్గొనే విద్యార్థులు 2012 జనవరి 1లోపు ఉన్న వారు అర్హులని, అండర్–17 విభాగంలో పాల్గొనే విద్యార్థులు 14ఏళ్ల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్ జిరాక్స్‌తో హాజరై పీడీ శ్రీనివాసులుకు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

శాంతినగర్: పత్తి రైతులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాధ అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు పంట సాగు విధానం, తెగుళ్లు, చీడపీడల నివారణ, మందుల మోతాదు, నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో కొంకల, తనగల ఏఈఓలు విమల, వినోద్, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లుగౌడ్(61) మంగళవారం మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి పలువురు నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక

కేటీదొడ్డి: ధరూర్ మండల కేంద్రంలో 69వ ఎస్‌జీఎఫ్ఐ గేమ్స్ కబడ్డీ జోనల్‌స్థాయి అండర్–14 కబడ్డీ పోటీలకు మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వెన్నెల, పవిత్ర ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం విజయభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో అమరేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాలలతో పని చేయించడం నేరం

ధరూరు: బాలలతో పని చేయించడం చట్టరీత్యా నేరమని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు రాజేంద్ర, శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అయా గ్రామాల్లో పనులు చేస్తున్న బాల కార్మికులను గుర్తించి ధరూరు ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడి బయట ఉన్న బాలలను చదువు వైపు మళ్లించేందుకు అందరి సహకారం ఉండాలన్నారు. డ్రాప్ అవుట్‌ను తగ్గించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ అధికారి లక్ష్మీదేవి, హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



బాల కార్మికులను పాఠశాలలో చేర్పిస్తున్న డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి


అయిజలో విత్తనాలు పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి


ఇటిక్యాలలో విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఇటిక్యాల: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి రవి కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జాతీయ ఆయిల్ మిషన్ పథకం ద్వారా మండలంలోని రైతుల ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యత్వం ఉన్న 240 మంది రైతులకు 100 శాతం రాయితీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఏఓ రైతులకు సాగు విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, వ్యవసాయ అధికారులు, రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉచితంగా విత్తనాలు పంపిణీ

అయిజ: ప్రభుత్వం రైతులకు ఉచితంగా అందించే వేరుశనగ విత్తనాల రెండో విడత పంపిణీ కార్యక్రమం పట్టణంలోని ఎఫ్‌పీఓ గోదాంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎంఈఓ పథకం ద్వారా రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు సాగుచేసి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

గట్టు: పదో తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో ముఖ్యమైన మలుపని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి డాక్టర్ ప్రియాంక సూచించారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి నమ్మకాన్ని పెట్టుకుని వైఫల్యాలకు బయపడకుండా, వాటి నుంచి గుణపాఠాలుగా నేర్చుకొని అధిగమించాలన్నారు. ఒత్తిడికి లొంగకుండా మీకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకోవాలన్నారు. సమయపాలన పాటిస్తూ, క్రమశిక్షణతో ముందుకు సాగితే విజయాలు సాధించవచ్చన్నారు. చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాల అభివృద్ధి చేసుకోవాలన్నారు. నేటి పోటి ప్రపంచంలో విజయవంతంగా నిలవాలంటే నిరంతర అభ్యాసం అవసరమన్నారు. గతేడాది మాదిరిగా ఈ ఏడాది కూడా 100 శాతం ఫలితాలను సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వంట ఏజెన్సీని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నయ్య, హెచ్‌ఎం నల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు మోటివేషన్ తరగతులు చెబుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక

వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

శాంతినగర్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ డాక్టర్ స్వరూపరాణి సూచించారు. స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపట్టే విధానంపై సిబ్బందికి డాక్టర్ సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయా గ్రామాలకు కేటాయించిన తేదీల్లో పశువైద్య సిబ్బంది టీకాల పంపిణీ చేస్తార్నారు. జీవాల యజమానులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వీఎల్ఓ వరప్రసాద్, ఎల్ఎస్ఏ లతీఫ్, ఓఎస్‌లు రవి, వెంకటమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి టీకాల పంపిణీ

ఉండవెల్లి/ఎర్రవల్లి: మండల కేంద్రంలో ఈ నెల 15 నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

❖ గాలికుంటు వ్యాధి నివారణకు బుధవారం పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత టీకాలు పంపిణీ చేయనున్నట్లు ఎర్రవల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి గ్రామాల వారీగా వచ్చేనెల 14 వరకు టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

గద్వాల: జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డులో తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో సుశీల నేత్రాలయం డాక్టర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గద్వాల ప్రాంతంలోని విశ్రాంత ఉద్యోగుల కోసం ఉచితంగా వైద్య కంటి పరీక్షలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సీఎం సహాయ నిధి గొప్పవరం

పేద ప్రజలకు సీఎం సహాయ నిధి గొప్ప వరమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేటీదొడ్డి, మల్దకల్ మండల పరిధిలోని లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు.

ఉల్లి పంటను వదిలేసిన రైతు

రాజోళి: ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మార్కెట్‌కు తీసుకెళ్లే ఖర్చులు కూడా పెట్టలేక పంటను వదిలేశాడు ఓ రైతు. మండల కేంద్రానికి చెందిన చింతరేవుల శేఖర్ రెండు ఎకరాల్లో ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టి సాగు చేశాడు. కానీ క్వింటా ఉల్లి ధర రూ.350 ఉండటంతో కూలీల ఖర్చు, రవాణా ఖర్చులు కూడా రావని పంటను వదిలేశాడు. ఉల్లిని కోసుకోమని గ్రామస్తులకు చెప్పడంతో పలువురు గ్రామస్తులు ఉల్లి కోసుకుని బస్తాల్లో తీసుకెళ్లారు. పెట్టుబడి కూడా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.


ఉల్లిపాయలు బస్తాల్లో తీసుకెళ్తున్న గ్రామస్తులు

నల్లతామర నివారణతో అధిక దిగుబడి

అమరచింత: నల్లతామర నివారణతో మిరప పంటలో అధిక దిగుబడి పొందవచ్చని కేవీకే శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చంద్రనాయక్ తండాలో ఈనాటి రైతు– శాస్త్రవేత్త సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు హాజరైన రైతులతో కలిసి సాగు చేస్తున్న మిరపపంట పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప పంటల్లో యాజమాన్య పద్ధతులను వివరించారు. వైరస్ తెగులు రావడానికి కారణమైన నల్లతామర పురుగును నివారణకు పలు సూచనలు సలహాలను రైతులకు వివరించారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా కొద్ది మంది రైతులకు జిగురు అట్టలు, వేపనూనె, లింగాకర్షక బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ అరవింద్, ఏఈఓ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.


యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి